# స్నేహం

## చాగంటి శంకర్



కొండల్రావు సిటీ బస్సులో తనని తానే కూరుకున్నాడు. దౌర్జన్యంగా తోసుకొస్తున్న జనం చెమట కంపు. బస్సు కుదుపులు అతని ఆలోచనలని మాత్రం ప్రతిఘటించలేకపోతున్నాయి. "పొద్దున్నే కలుద్దాం" అని కృష్ణారావుతో అనడం మాత్రం అన్నాడు. "రాధని అడగడం ఎలా?" అన్న ఆలోచన అప్పుడు ఆ బస్సులోనే వచ్చింది. నాలు గైదు తలల నందుల్లోంచి బ సైక్కడి దాకా వచ్చిందో నని అప్పుడప్పుడు చూస్తున్నా "తలని తాకట్టు పెట్టైనా తేవాలి!" అనుకున్నాడు. "తాకట్టుకి తలని తీసుకొనే వా డెవడు?" అని తనని తానే ప్రశ్నించుకున్నాడు.

పొదుపు చేసి దాచుకున్న దంతా చెల్లాయి పెళ్ళికి ఖర్చు చేశాడు. 'అది పెళ్ళి కాకుండా ఉండి పోతుందేమో' అన్న బెంగవల్ల ఉద్యోగం లేకపోయినా 'మేం ఇప్పిస్తామ'ని భరోసా ఇచ్చి మరీ చేశారు పెళ్ళి. ఆ పెళ్ళికి సూత్రధారీ; పెద్దదిక్కూ కొండల్రావే. ఇప్పు డతను రెండు రోజుల్లో పది వేలు పుట్టించాలి!!

